ప్రగతి ఫలకాలు మాయం

- వైఎస్సార్‌సీపీ పాలనలో కోట్లాది రూపాయల అభివృద్ధి
- ప్రభుత్వం మారగానే సంబంధిత శిలాఫలకాలు మాయం
- సుమారు 30 ఫలకాలు సచివాలయాల్లో మూలన..
- మరికొన్ని ధ్వంసం

కనుల ముందు అభివృద్ధి కనిపిస్తున్నా.. ఆ ఆనవాళ్లను, గత ప్రభుత్వ ఘనతను అంగీకరించలేక వాటిని కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తున్నారు కొందరు. అందులో భాగంగానే గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలో వందల కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను మాయం చేస్తున్నారు. కూటమి నాయకుల ఒత్తిడికి తలొగ్గి కొందరు అధికారులు కూడా ఇందులో భాగస్వాములయ్యారనే ఆరోపణలున్నాయి. జీవీఎంసీ మధురవాడ జోన్–2లోని పరిస్థితి ఇది.. 5, 6, 7, 8, వార్డులతో పాటు గతంలో ప్రభుత్వ పెద్దలు మధురవాడ వచ్చినప్పుడు నగరం మొత్తానికి చెందిన అభివృద్ధి పనులకు ఇక్కడ శిలా ఫలకాలు ఆవిష్కరించారు. పనులు కూడా విజయవంతంగా పూర్తయ్యాయి. కానీ, ఆ శిలాఫలకాలను కూడా వీరు పక్కన పడేశారు. సుమారు రూ.100 కోట్లు పైన వెచ్చించి చేపట్టిన పనులకు శిలా ఫలకాలు పెట్టలేదంటే నమ్మశక్యం కాదు. కానీ, ఇది నిజమని రుజువు చేసే సాక్ష్యాలు కనులముందే ఉన్నాయి.

– మధురవాడ


పీఎం పాలెం పాత పంచాయతీ ఆఫీసు సచివాలయంలో మూలన పడేసిన శిలాఫలకాలు

రూ.కోట్లతో పనులు చేసినా...


శిలాఫలకం లేని రూ. 2.50కోట్లతో అభివృద్ధి చేసిన స్వతంత్రనగర్ పెద్ద పార్కు


రూ.2.50కోట్లతో నిర్మించిన శిలాఫలకం లేని నగరంపాలెం రోడ్డు - స్వతంత్రనగర్ కనెక్టింగ్ బ్రిడ్జి

- స్వతంత్రనగర్ పార్కులో గతంలో టీడీపీ ప్రభుత్వం అరకొర పనులు చేసి, పార్కును ఆక్రమించిన అక్రమార్కులకు రక్షణ కల్పించేలా వదిలేసింది. తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.50కోట్లు వెచ్చించి సుమారు 5.50 ఎకరాల్లో మధురవాడకే పెద్ద పార్కుగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసింది. దీనికి గత ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభోత్సవం చేశారు. దానికి సంబంధించి శిలా ఫలకం ఎలా ఏర్పాటు చేయాలో కూడా దిశానిర్దేశం చేశారు. కాని ఆ శిలా ఫలకం ఏమైందో అధికారులే చెప్పాలి.
- జీవీఎంసీ 5, 7 వార్డుల్లో నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నుంచి స్వతంత్రనగర్‌కు వెళ్లే భారీ కాల్వపై కనెక్టింగ్ బ్రిడ్జి లేక ప్రజలు ఎన్నో ఏళ్లు ఇబ్బంది పడ్డారు. దీంతో లక్ష్మీదేవి అమ్మ గుడి నుంచి నగరం పాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డుకు వెళ్లే మార్గంలో కనెక్టింగ్ బ్రిడ్జి అప్రోచ్ వాల్ తదితర పనులను రు. 2.50కోట్లతో చేపట్టారు. సుమారు మరో రూ.5కోట్లతో 6 కనెక్టింగ్ బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మాణం చేశారు. వాటికి కూడా శిలాఫలకాలు లేవు.
- ఇక పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద రు. 2.50కోట్లతో యోగా థీమ్ పార్కు, బక్కన్నపాలెంలో రూ.1.95కోట్లతో స్పోర్ట్స్ థీమ్ పార్కు, ఎంఎస్ఆర్ లే అవుట్‌లో రూ. 1.82 కోట్లతో మరో పార్కు అభివృద్ధి చేశారు. వీటిలో ఎంఎస్ఆర్ లే అవుట్ పార్కుకు తాత్కాలిక శిలా ఫలకమే ఏర్పాటు చేశారు. ఇతర చోట్ల అంతంత మాత్రమే. ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలు.

వీటిపై వివరణ కోరేందుకు ఈఈ శాంతి రాజును సంప్రదించగా సరిగ్గా స్పందించక పోవడం గమనార్హం.

మరీ ఇంత ఘోరమా?


సచివాలయం వెనుక టాయిలెట్ మ్యాన్‌హోల్‌పై పెట్టిన శిలాఫలకం ముక్క

స్వతంత్రనగర్ తుపాను రక్షిత భవనంలో ఉన్న రెండు వార్డు సచివాలయాలు, జీవీఎంసీ వార్డు ఆఫీసు ఉన్న ఇక్కడ 10వరకు శిలా ఫలకాలను పనికి రాని వస్తువులు పడేసిన చోట్ల పడేశారు. మరి కొన్ని ఆనవాళ్లు కూడా లేవు. ఇక్కడ కొన్నింటిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విరగ్గొట్టేశారు. టాయిలెట్ మ్యాన్‌హోల్ మీద శిలాఫలకం ముక్క మరీ ఘోరం.

- నగరంపాలెం చెరువు వద్ద ఉన్న తుపాను రక్షితం భవనంలో నడుస్తున్న వార్డు సచివాలయాలు, బొట్లవానిపాలెంలోని సచివాలయాల్లో కొన్ని పడేసి వదిలేశారు.
- పీఎం పాలెం పాత పంచాయతీ ఆఫీసులో నడుస్తున్న సచివాలయం బయట 12 శిలాఫలకాలు పడి ఉన్నాయి.

కోడ్ వచ్చే ముందు 2 నెలల్లో చేపట్టిన పనులు

అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడానికి 2 నెలల ముందు జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డుల్లో చేపట్టిన చిన్న పార్కులు అభివృద్ధి, సీసీ రోడ్లు, సీసీ కాల్వలు, కల్వర్టులు, బీటీ రోడ్లు వంటి అభివృద్ధి పనులు వివరాలు ఇలా ఉన్నాయి.

- జీవీఎంసీ 5వ వార్డులో రు. 2.46కోట్లతో 12 అభివృద్ధి పనులు చేపట్టారు.
- 6వ వార్డులో రూ.8.57 కోట్లతో 48, పనులు 7వ వార్డులో రు. 3.98కోట్లతో 21 పనులు, 8వ వార్డులో రూ.10.81కోట్లతో 55 పనులు చేపట్టారు. ఇందులో కనీసం 20శాతం పనులకు కూడా శిలా ఫలకాలు ఏర్పాటు చేయలేదని తెలుస్తోంది.

శిలా ఫలకం దిమ్మనే ఆక్రమించేశారు

జీవీఎంసీ 5వ వార్డు లక్ష్మీదేవి అమ్మ గుడి సమీపంలో ఓ వ్యక్తి ప్రభుత్వ అభివృద్ధి పనుల గురించి ఏర్పాటు చేసిన శిలాఫలకం దిమ్మనే ఆక్రమించేశాడు. చుట్టూ పందిరి వేసి దాని ఆనవాళ్లు కూడా లేకుండా చేసేశాడు.


స్వతంత్రనగర్ లక్ష్మీ దేవి అమ్మ చెట్టు వద్ద ఆక్రమించేసిన శిలా ఫలకం దిమ్మ

ఇప్పడైనా ఫలకాలు ఏర్పాటు చేయాలి



టీడీపీ, ఇతర ప్రభుత్వాలు పనులు చేయకుండా శిలా ఫలకాలు పెట్టుకున్నారు. కాని మా ప్రభుత్వంలో పనులు పూర్తి చేసిన వాటికి అధికారులు శిలా ఫలకాలు ఏర్పాటు చేయలేదు. ఇది సరికాదు. చేసిన పనులకు ఇప్పుడైనా శిలా ఫలకాలు ఏర్పాటు చేయాలి. శిలాఫలకాలను అధికారులు ఎక్కడెక్కడ మూలన పడేశారో మా దగ్గర వివరాలు ఉన్నాయి. అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

– డాక్టర్. గాది రోశి రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ

క్లుప్తంగా

14, 15 తేదీల్లో యోగా పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం: భీమిలి దరి కీతిన్‌పేట వద్దనున్న సన్ స్కూల్‌లో ఈ నెల 14,15 తేదీల్లో రాష్ట్ర యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రామారావు, ఎన్.శ్రీనివాసరావు, జేడీ చక్రవర్తి, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ


ప్రసాద్

పీఎం పాలెం: పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జి.వి. ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉన్నతాధికారుల సూచనల మేరకు కృషి చేస్తానన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

తగరపువలస: స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ వర్కర్ మాదాబత్తుల స్వాతి మాట్లాడారు. విద్యార్థులు ప్రతిరోజూ రెండుసార్లు స్నానం, రెండుసార్లు బ్రష్ చేయాలని సూచించారు. శుభ్రం చేసిన దుస్తులు ధరించాలని, తల దువ్వుకోవడం, గోళ్లు కత్తిరించుకోవాలని తెలిపారు. నైతిక విలువల గురించి తెలియజేశారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన అనారోగ్యం దరిచేరదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'ఆ విధుల నుంచి తప్పించండి'

పద్మనాభం: పాఠశాలల్లోని విద్యార్థుల మరుగుదొడ్ల శుభ్రత ఎలా ఉందో వారానికి రెండుసార్లు తనిఖీ చేసి, ఫొటోలు తీసే బాధ్యత నుంచి తమను తొలగించాలని సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్‌కు బుధవారం వినతి ఇచ్చారు. గతంలో ఉపాధ్యాయులు ఈ ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసేవారని పేర్కొన్నారు. కానీ ఆ పనిని వారు అవమానకరంగా భావించడంతో ఉపాధ్యాయులను తప్పించి, తమకు అప్పగించారన్నారు. తాము కూడా ఉపాధ్యాయుల వలె ఉన్నత చదువులు చదువుకున్నామని పేర్కొన్నారు.

ఈశ్వరమ్మకు నివాళులు


ఈశ్వరమ్మకు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు దుంప ఈశ్వరమ్మకు పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. వెలంపేటలో బుధవారం నిర్వహించిన సంతాపసభలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు రంగూరి సీతారామదొర, పందిరి విజయ్ తదితరులు పాల్గొని, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆమె కుమారులు ఆదినారాయణరెడ్డి సాయిరెడ్డిలను పరామర్శించారు.

నీ మూర్తికే మా మొదటి ప్రణామం


గణేష్‌నగర్ లక్ష్మీ గణపతి ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు


చంద్రంపాలెంలో భారీ గణనాథునికి పూజలు చేస్తున్న భక్తులు


తాటితూరు జంక్షన్‌లో కొలువుదీరిన 12 అడుగుల గణపయ్య


లక్ష్మీపురం కళ్లాల్లోని మండపంలో గణనాథుడు

వినాయకా.. నీ మూర్తికే మా మొదటి ప్రణామం అంటూ విఘ్నాధిపతిని భక్తిశ్రద్ధలతో అర్చిస్తున్నారు నియోజకవర్గవాసులు. విభిన్న రూపాల్లో కొలువుదీరిన గౌరీ సుతుడిని మనసారా అర్చిస్తున్నారు. గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గణేష్‌నగర్‌లోని విజయ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం చేశారు. రేవళ్లపాలెం శ్రీ సాయిసూర్య రెసిడెన్సీ, తాటితూరు జంక్షన్‌లో దొరయూత్ ఆధ్వర్యంలో 12 అడుగుల గణపతిని, లక్ష్మీపురం కళ్లాల్లో గణనాథుడిని, చంద్రంపాలెంలోని భారీ గణపయ్యను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. శివశక్తి నగర్ రోడ్డులోని లక్ష్మీటవర్స్‌లో గణేశ విగ్రహ ర్యాలీలో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

– తగరపువలస/మధురవాడ

నిమజ్జనానికి గణనాథులు


పాడుగుపాలెంలో నిమజ్జనానికి తరలిస్తున్న వినాయకుని విగ్రహం

తగరపువలస: భీమిలి, ఆనందపురం మండలాల్లో పలుచోట్ల వినాయక మండపాల నుంచి విగ్రహాలను బుధవారం నిమజ్జనానికి తరలించారు. మండపాల వద్ద ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేలాది మందికి నారాయణసేవ ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవంలో బాణసంచా, నేలవేషాలు, డీజే, కోలాటం అలరించాయి. సమీపంలోని చెరువులు, గోస్తని నది, భీమిలి సాగర సంగమ తీరంలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు మనీషా ఎంపిక



పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బి.మనీషా రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైంది. లంకెలపాలెంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ చాంపియన్ షిప్ పోటీల్లో మనీషా ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనుంది. ఈ సందర్భంగా మనీషాను హెచ్ఎం ఎ.బాలామణి, పీడీ కె.నారాయణమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

తిమ్మాపురంలో యథేచ్ఛగా ఆక్రమణలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తహసీల్దార్ పైలా రామారావు ఆదేశాల మేరకు వీఆర్వో అఖిల్ బుధవారం ఆక్రమిత స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను తొలగించే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ఇదిలా ఉండగా, అధికారులు ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి వెళ్లిపోతున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ మత్స్యకారుల పేరుతో ప్రభుత్వ స్థలాల అమ్మకాలు జరుగుతున్నాయని, వీటిపై కఠిన చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

కనులపండువగా రాధాష్టమి


అలంకరించిన రాధాకృష్ణుల విగ్రహాలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠంలో రాధాష్టమి వేడుకలను బుధవారం కనులపండువగా జరిపించారు. అంబరీష దాస ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో యదురాజ దాస మాట్లాడుతూ కృష్ణాష్టమి తరువాత వచ్చే అష్టమినాడు రాధాష్టమి నిర్వహిస్తామన్నారు. ఈమె శ్రీకృష్ణ భగవానుని అంశ అని, అంతరంగశక్తి అని తెలియజేశారు. ఆమె అనుగ్రహం ద్వారా మాత్రమే భక్తులు శ్రీకృష్ణుని అనుగ్రహం పొందగలుగుతారన్నారు. ఈ కలియుగంలో హరేకృష్ణ మహామంత్రం ఒక్కటే భక్తులకు ముక్తిదాయకమన్నారు. భవసాగరం నుంచి తరించగలరని చైతన్య మహాప్రభు మనకిచ్చిన వరమన్నారు. ఈ సందర్భంగా తులసి హారతి, సంధ్య హారతి ఇచ్చారు. దివ్య ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. రాధికాష్టకాన్ని స్తుతించారు. రాధారాణి సంకీర్తనలను భక్తులు లయబద్ధంగా ఆలపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేషంగా భక్తులు రాధాకృష్ణులను దర్శించుకున్నారు.

రుషికొండలో..


50 కిలోలతో ప్రత్యేకంగా తయారుచేసిన కేక్

కొమ్మాది: హరేకృష్ణ మూవ్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు రుషికొండలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో బుధవారం రాధాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. 50 కిలోలతో కేక్ తయారు చేయించి, దానిపై ఊయలను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేక్‌పై రాధాష్టమి విశిష్టతను తెలియజేయడం భక్తులను ఆకట్టుకుంది. ప్రభూజీ భక్తదాస శ్రీ రాధాకృష్ణులు ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు యదురాజ దాస తదితరులు పాల్గొన్నారు.

మెట్టవాలులో రక్షణగోడలు నిర్మించాలి

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట, రెండోవార్డు సత్యనారాయణమెట్ట వాలు ప్రాంతాల్లో రక్షణగోడలు నిర్మించాలని భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. బుదవారం ఈ ప్రాంతాలను సందర్శించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల నివారణకు జీవీఎంసీ చర్యలు చేపట్టి, అక్కడి ప్రజలకు భరోసా కల్పించాలన్నారు.

పంట కాల్వల్లో పూడిక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఇటీవల భారీ వర్షాలకు ముంపునకు గురైన గోస్తనీ తీర పంచాయతీలలో పంట కాలువలలో పూడికతీత పనులను సిబ్బంది బుధవారం చేపట్టారు. ఈ నెల 9న జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు కూడా ఈ ప్రాంతాల్లో పర్యటించారు. 'పంట కాల్వల్లో పూడికలు' శీర్షికతో ఈ నెల 10వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. టి.నగరపాలెం పంచాయతీ కురపల్లి పంట కాలువలో జేసీబీ సాయంతో బుధవారం పూడికతీత పనులను చేపట్టారు. కాలువలో నీరు గ్రామంలోకి రాకుండా గోస్తని నదిలోకి మళ్లించారు. ఈ పనులను సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, ఎంపీటీసీ పల్లా నీలిమ, సన్యాసిరావు, ఇరిగేషన్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.



టి.నగరపాలెం కురపల్లి పంట కాలువలో పూడిక తొలగింపు పనులు జరుగుతున్న దృశ్యం

రైతులకు చేరని వడ్డీ రాయితీ

- గత ప్రభుత్వ హయాంలో సకాలంలో చెల్లింపు
- సాగుదారుల్లో ఆందోళన

తగరపువలస: 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసి అయిదు మాసాలు పూర్తయినా వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీ రైతుల ఖాతాలకు జమ చేయక పోవడంతో సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి రైతులు వ్యవసాయ రుణాలు తీసుకుంటే దీనిపై 7 శాతం వడ్డీ విధిస్తారు. ఆ ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణాలు అదే ఏడాది సక్రమంగా చెల్లిస్తే తరువాత ఆర్థిక సంవత్సరంలో రెండు విడతలుగా వడ్డీని రైతుల ఖాతాలకు జమ చేస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అయిదేళ్లు జూన్‌లో 4 శాతం, సెప్టెంబరులో 3 శాతం వడ్డీ రాయితీ డబ్బులు సకాలంతో రైతుల ఖాతాలకు జమ అయ్యేవి. ప్రస్తుతం భీమిలి నియోజకవర్గంలో వందకు పైగా షెడ్యూల్ బ్యాంకులతో పాటు పలు పీఏసీఎస్‌లు సుమారు 4వేల మందికి రూ.5 కోట్ల వరకు వ్యవసాయ రుణాలు మంజూరు చేశాయి. తగరపువలస, మధురవాడ పరిధిలో వ్యవసాయం తక్కువగా ఉన్నందున ఇక్కడ పదిమందికి మించి వ్యవసాయ రుణాలు తీసుకోలేదు. అలాగే, ఇక్కడ రుణాలు కూడా సక్రమంగా తీర్చలేదు. మిగిలిన గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో పీఏసీఎస్ నుంచి వందల సంఖ్యలో రైతులకు రూ.50 లక్షలకు మించి రుణాలు ఇచ్చి సక్రమంగా వాయిదాలు, వడ్డీ వసూలు చేసినా రాయితీ డబ్బులు మాత్రం కూటమి ప్రభుత్వం విడుదల చేయకపోవడం రైతులను కలచివేస్తోంది. ఒక్క మజ్జివలస పీఏసీఎస్‌లోనే రైతులకు మాఫీ సొమ్ము రూ.1.50 లక్షలు వసూలు కావలసి ఉందని రైతులు అంటున్నారు. రుణ వాయిదాలు, వడ్డీలు సకాలంలో చెల్లించిన రైతులకు ప్రభుత్వం వడ్డీ మాఫీ డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

చెరువులో పడి వ్యక్తి దుర్మరణం


మృతుడు నాగరాజు

పద్మనాభం: మండలంలోని బి.తాళ్లవలసలో ఒక వ్యక్తి కాలు జారి చెరువులో పడి దుర్మరణం చెందినట్టు ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఏఎస్ఐ, స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. తాళ్లవలస గ్రామానికి చెందిన చింతపల్లి నాగరాజు(41) మంగళవారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లేందుకు గ్రామంలోని చిన్న చెరువు వద్దకు వెళ్లాడు. కాలు జారి చెరువులో పడిపోయాడు. నాగరాజు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అర్ధరాత్రి 2 గంటల సమయంలో చెరువు వద్దకు వెళ్లి వెదకగా, అతడి జాడ కనిపించలేదు. బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు మూత్ర విసర్జన కోసం చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో తల కనిపించడంతో విద్యార్థులు ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయగా, వారు చెరువు వద్దకు వెళ్లి చూశారు. తల పైకి కనిపిస్తూ మిగతా భాగం చెరువులో మునిగి ఉండటంతో పైకి తీయగా నాగరాజు మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. మృతుడు నాగరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగరాజు రాడ్ బెండింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇంటికి పెద్ద దిక్కు అయిన నాగరాజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

పద్మనాభం: వరి పైరు నీటి ముంపునకు గురైన రైతులు తప్పనిసరిగా యాజమన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని బాందేవుపురం, విలాస్కాన్ పాలెం, అనంతరం గ్రామాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించి నీటి ముంపునకు గురైన వరి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు విజయప్రసాద్, సి.హెచ్.సుబ్రమణ్యం, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఎం.విశాలాక్షి, ఎ.శిరీష, కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఏబీఎం శిరీష, ఏవో ఎంవీఎస్‌చలం తదితరులు పాల్గొన్నారు.

తాటితూరులో లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం


తాటితూరులో లో ఓల్టేజీ సమస్యలను పరిశీలిస్తున్న డీఈఈ రమేష్

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో లో ఓల్టేజీ సమస్యను చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది ఎట్టకేలకు పరిష్కరించారు. 'తాటితూరులో లో ఓల్టేజీ సమస్య' శీర్షికతో ఈ ఏడాది జూలై 10న సాక్షిలో ప్రచురితమైన కథనానికి భీమిలి డీఈఈ ఆర్.రమేష్ స్పందించారు. పంచాయతీలో పర్యటించి ఎస్సీ కాలనీ, పల్లంటి వారి వీధి, తెలగావీధి, రాజవీధిలో ఉన్న సమస్యలను సిబ్బంది సాయంతో పరిష్కరించారు. ఏడు గ్రామాల్లో సుమారు రూ.6.49 లక్షలతో పనులు చేపట్టారు. ప్రమాదకరమైన పాత ఇనుప స్తంభాలను మార్చి, వాలిపోయిన లైన్లు సరిచేశారు. రెండు చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలలో సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, చిన్నారావు, ఉప సర్పంచ్ కొయ్య శ్రీనివాసరెడ్డి, పతివాడ రాంబాబు తదితరులు విద్యుత్ సిబ్బందికి సహాయ సహకారాలు అందించారు.